క్లుప్తంగా

వైభవంగా విజయ గణపతికి అభిషేకం



విజయగణపతి ఆలయం వద్ద అన్నదానం

తిరుపతి రూరల్: తిరుచానూరు పంచాయతీ పరిధిలోని నేతాజీ నగర్‌లో వెలసిన విజయ గణపతి ఆలయంలో ఆదివారం అభిషేకం, అన్నదాన కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ అభిషేకంలో పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్వాహకురాలు పుష్ప మునిరాంరెడ్డి దంపతులు, అర్చకులు ఆయన్ను ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానికంగా నివాసముంటున్న కె.రామచంద్ర నాయుడు కుటుంబ సభ్యులు 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శిల్పారామంలో భరత నాట్య ప్రదర్శన



నాట్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నై అంబత్తూరుకు చెందిన శ్రీశివశక్తి నాట్యాలయ ఆధ్వర్యంలో చిన్నారుల భరతనాట్యం ఆకట్టుకున్నాయి. వివిధ పాటలకు కళాకారులు కేశికా రామ్, జనని, ధనుశ్రీ, లక్షిత, లావణ్య, సాయి, సౌందర్య, అనసియా, తియాశ్రీ, జెషికా, ధబుష్ణ, యాజిని, యాల్విజ్లి, శివరంజిని, మహాలక్ష్మి, నక్షత్ర, ఆధన్య సాయి, శృతి, హార్థికల చూడచక్కని హావభావాలతో నాట్య ప్రదర్శన చేపట్టారు. వారి అభినయానికి మంత్రముగ్ధులైన ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం ఏఓ సూర్యతేజ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

ఘనంగా రాధాష్టమి వేడుకలు



రాధా గోవిందుల ఉత్సవమూర్తులకు శంఖాభిషేకం చేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: శ్రీకృష్ణ భగవానుని ఇష్టసఖి రాధారాణి అవతరణ మహోత్సవం సందర్భంగా ఇస్కాన్ మందిరంలో ఆదివారం రాధాష్టమిని ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి తర్వాత 15వ రోజు శ్రీరాధాష్టమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఇస్కాన్‌లోని కమల మందిరంలో శ్రీరాధా గోవిందులతో కూడిన అష్టసఖులను విశేషంగా అలంకరించారు. భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా శ్రీరాధా గోవిందులకు శంఖాభిషేకం చేశారు. అనంతరం భక్తుల సంకీర్తన గానం చేపట్టారు. మధ్యాహ్నం ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతిరమణదాస్ ప్రభు శ్రీరాధారాణి లీలలను ప్రవచనం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిరం కార్యదర్శి లీలాపారాయణదాసు, ఇతర ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, తమిళనాడు మంత్రి ఏకేఎస్ విజయన్, సినీ నటుడు సాయికుమార్, నటుడు ఆది దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

నోటీస్ బోర్డు

- శ్వేత భవన్‌లో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి హరికథకులకు హరికథా వైభవం పేరిట ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభం.
- తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉదయం 10 గంటలకు నూతన పాలక మండలి నియామకానికి వచ్చిన దరఖాస్తుల పరిశీలన.
- నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ప్రజలు తమ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవచ్చు.
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక, సమస్యలపై వినతుల స్వీకరణ.
- ఓటేరులోని గంగిరెడ్డులకాలనీవాసులకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ ఉదయం 11 గంటలకు ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన.

గణపతి బప్పా మోరియా..

- వేడుకగా వినాయక నిమజ్జనం
- వినాయక సాగర్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- తుమ్మలగుంటలో ఉట్టికొట్టిన యువకులు
- హాజరైన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



తిరుపతి నగరంలో ఊరేగింపుగా వెళుతున్న వినాయకులు

తిరుపతి మంగళం : వినాయక చవితి పండుగ సందర్భంగా తిరుపతి నగరంలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి వినాయక సాగర్ వద్దకు తరలించారు. మంగళం రోడ్డులో ఏర్పాటు చేసిన ఆహ్వాన వేదిక వద్ద నిమజ్జన కమిటీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, కరాటి శీను, రఘురామిరెడ్డి, వూకా విజయ్‌కుమార్ హారతులు పట్టి స్వాగతం పలికారు. నిమజ్జనాన్ని తిలకించేందుకు వేలాది మంది జనం తరలివచ్చారు. వినాయకసాగర్ వద్ద వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేయడానికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తుమ్మలగుంటలో నిమజ్జనోత్సవం

తిరుపతి రూరల్/పాకాల: తిరుపతి రూరల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసియున్న వినాయకుని ప్రతిమలను ఆదివారం సాయంత్రం నిమజ్జనానికి తరలించారు. తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన తుంబుర వినాయకుని నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఉట్టికొట్టి అందరినీ అలరించారు. చంద్రగిరి నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నిమజ్జనం వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం దామినేడు వద్దనున్న చెరువులో నిమజ్జనం చేశారు. పేరూరు, హరిపురం కాలనీ, జనార్దన కాలనీ, చిగురువాడ, మల్లంగుంట, సి.గొల్లపల్లి, వేదాంతపురం, అవిలాల, సాయినగర్, లింగేశ్వరనగర్, పుదిపట్ల, పెరుమాళ్లపల్లి, సి.మల్లవరం గ్రామాల్లోని వినాయకుని ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు. అలాగే పాకాల మండలంలోనూ వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు.



యువకుల కోలాహలం



గంగ ఒడికి చేరుతున్న గణపయ్య



తిరుపతి రూరల్ : సి.గొల్లపల్లిలో వినాయకుని మండపం వద్ద కోలాహలం



పాకాల: మణిపిరెడ్డిపల్లి వినాయకుని నిమజ్జనం




తుమ్మలగుంటలో అన్నదానం



నీటిలో మునుగుతున్న వినాయకుడు



క్రేన్లతో వినాయకుని నిమజ్జనం



ఆదిత్రీ అపార్ట్‌మెంట్ వద్ద..



వినాయక సాగర్ వద్ద ప్రజల సందడి



తుమ్మలగుంటలో 99వేలు పలికిన లడ్డు



రిక్షాలో తరలుతున్న వినాయకుడు



ఎన్‌జీవో కాలనీలో..



నిమజ్జనంవేళ..

ఊరూరా చవితి వేడుకలు



జమండ్ల వీధిలో భక్తులకు అన్నదానం

చంద్రగిరి: వినాయక చవితి సందర్భంగా మండల వ్యాప్తంగా ఊరూరా వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 5వ రోజు కావడంతో మండల వ్యాప్తంగా ప్రతిష్ఠించిన వినాయక ఉత్సవాల నిమజ్జనం కార్యక్రమాన్ని వేడుకంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ మండపాల్లో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలను చేపట్టారు. ఆపై స్థానిక భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం మరోసారి స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించి, ఊరేగింపు ఉత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు కోలాటాలు, భజన బృందాలు, ఉట్లోత్సవాన్ని నిర్వహించారు. జమండ్ల వీధిలో నిర్వహించిన ప్రత్యేక పూజలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేటి సమాజానికి మహాప్రస్థానం గీతాలు సజీవ సాక్ష్యం



మాట్లాడుతున్న అరసం రాష్ట్ర నేత సాకం నాగరాజు

తిరుపతి కల్చరల్: నేటి సమాజ స్థితిగతులను శ్రీశ్రీ ఆనాడే గుర్తించి అక్షర రూపం ఇచ్చారని, ఆయన రాసిన మహాప్రస్థానం గీతాలు నేటి సమాజానికి సజీవ సాక్ష్యమని అరసం రాష్ట్ర నేత సాకం నాగరాజు తెలిపారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ శతాబ్దం నాది అన్న శ్రీశ్రీ మహాప్రస్థానం పుస్తకం రాసి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం గంధమనేని శివయ్య భవన్‌లో ఏపీ అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్య మండలి సంయుక్తంగా చర్చాగోష్ఠి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు, సమాజ చైతన్యం కోసం ఆయన సాగించిన రచనా చైతన్య ప్రస్థానాన్ని గురించి వివరించారు. జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, ఈతరం కవితా వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో శ్రీశ్రీ గీతాలు ఎందరినో ప్రభావితం చేశాయన్నారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ శ్రామిక జీవన సౌందర్యాన్ని శ్రీశ్రీ తన రచనల్లో వివరించారని గుర్తు చేశారు. అంతకుముందు అభ్యుదయ కవి, రచయిత ఆరుద్ర శతజయంతి సందర్భంగా వారి రచనలను పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్‌బాబు విశ్లేషించారు. కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, పేరూరు బాలసుబ్రమణ్యం, నడ్డి నారాయణ, విశ్వనాథ్‌రెడ్డి, కడివేటి మునిరత్నం, రెడ్డిప్రసాద్, లక్ష్మి, గుప్తా, సుబ్రమణ్యం, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, గుర్రప్ప, శ్రీనివాసులు, ఉదయ్‌కుమార్, అభ్యుదయ వేదిక రాష్ట్ర నేత వెంకటరమణ పాల్గొన్నారు.

అలరించిన శ్రుతిలయల సంగీత గానామృతం



పాటలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

తిరుపతి కల్చరల్: తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో పద్మావతి మహిళా వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో రెండవ రోజైన ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన శ్రుతిలయలు సంగీత గానామృతం శ్రోతలను ఆకట్టుకుంది. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ భావితరాలకు కావాల్సిన సంగీతాన్ని అందించిన దర్శకులు కె.విశ్వనాథ్, బాపు అభినందనీయులని కొనియాడారు. సినీ నిర్మాత, నర్సింగ్ కళాశాల అధినేత వై.ప్రవీణ్ మాట్లాడుతూ విశ్వనాథ్, బాపు చిత్రాల్లో నవరసాలతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు మేళవించిన అద్భుత సన్నివేశాలు వుంటాయని తెలిపారు. అలాంటి సినిమాలు నేటి తరానికి ఎంతో అవసరమని తెలిపారు. బిగ్‌బాస్ షో 7 టాపర్, సీరియల్స్ నటి ప్రియాంక మాట్లాడుతూ సంగీతానికి, సాహిత్యానికి పెద్ద పీట వేసిన బాపు, విశ్వనాథ్ ధన్యులని కొనియాడారు. వారిని స్మరిస్తూ శ్రుతిలయలు పేరుతో వారి చిత్రాల పాటలను నేటి తరానికి అందిస్తున్న తిరుపతి ఫిలిం సొసైటీ ప్రతినిధులు అభినందనీయులని పేర్కొన్నారు. అనంతరం గాయనీ గాయకులు శ్రీరామ్ చరణ్, కీర్తి, ధృతి జయరాం పాటలను సుమధురంగా గానం చేశారు. కార్యక్రమంలో తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు వైఎస్.బాబు, కార్యదర్శి శేషగిరిరావు, కోశాధికారి యు.ప్రసాదరావు, ఉపాధ్యక్షులు బుజ్జిబాబు, అనసూయ, శాంతావాణి, భాస్కర్, శమంతకమణి, స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడా దినోత్సవం ర్యాలీ విజయవంతం



జాతీయ క్రీడాదినోత్సవం ర్యాలీ

తిరుపతి రూరల్: తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, వెల్‌నెస్ సెంటర్, వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ర్యాలీ విజయవంతమైంది. ఈ ర్యాలీని యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమ వెన్నెం ప్రారంభించగా వర్సిటీ విద్యార్థినులు ముందుకు కదిలారు. ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా వివిధ కళా రూపాలతో విద్యార్థులు అలరించారు. వర్సిటీ పరిపాలన భవనం నుంచి తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ వరకు సాగిన ఈ ర్యాలీలో అధ్యాపకులు, పరిపాలనా భవనం సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు.

మహానేత విగ్రహాలకు కొత్తరూపు

చంద్రగిరి నియోజకవర్గంలోని వైఎస్సార్ విగ్రహాలు అన్నీ కళకళలాడుతున్నాయి. మహానేత వైఎస్సార్‌పై అభిమానం, యువనేత జగనన్న నాయకత్వంపై నమ్మకంతో పార్టీ నేతలు ఎక్కడికక్కడ విగ్రహాలు రంగులు పూయిస్తున్నారు. 16వ వర్ధంతి వేడుకలకు పార్టీ క్యాడర్ ఇప్పటి నుంచే సిద్ధమవుతుండడంతో అన్ని మండల కేంద్రాల్లో హడావుడి కనిపిస్తోంది.

– తిరుపతి రూరల్

- వైఎస్సార్ విగ్రహాలకు రంగులు వేయిస్తున్న నేతలు
- 16వ వర్ధంతి కార్యక్రమాలకు సిద్ధమవుతున్న వైఎస్సార్ సీపీ కేడర్
- హాజరవుతున్న నియోజకవర్గం ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



సామిరెడ్డిపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి రంగులు వేయిస్తున్న పార్టీ నేతలు



పాకాల మండలం పదిపుట్ల బైలు వద్ద వైఎస్సార్ విగ్రహానికి రంగులు వేస్తున్న గ్రామస్తులు

చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సూచనల మేరకు అన్ని మండలాల్లో పార్టీ నేతలు మహానేత వైఎస్సార్ విగ్రహాలకు రంగులు వేయించారు. కొత్త విగ్రహాలుగా తళతళలాడేలా బంగారం పూతతో రంగులు పూయడం, పలు చోట్ల విగ్రహాలు ఏర్పాటు చేసిన దిమ్మెలు, గేట్లుకు పార్టీ రంగులు వేయడంతో చూడముచ్చటగా కనిపిస్తున్నాయి. తిరుపతి రూరల్ మండలంలోని చిగురువాడ, కుంట్రపాకం, పెరుమాళ్లపల్లి, పుదిపట్ల, పేరూరు, జనార్దనకాలనీ, బ్రాహ్మణపట్టు, అవిలాల, సప్తగిరి కాలనీల్లోని వైఎస్సార్ విగ్రహాలకు స్థానిక నేతలు బాధ్యత తీసుకుని రంగులు వేయించారు. అలాగే చంద్రగిరి మండలం ఐతేపల్లి, గంగుడుపల్లిలో వైఎస్సార్ విగ్రహాలు రంగులు వేయగా పాకాల మండలంలోని పాకాల, సామిరెడ్డిపల్లి, బందార్లపల్లి, పదిపుట్లబైలు, వరదప్పనాయుడుపేటలో వైఎస్సార్ విగ్రహాలు రంగులు వేశారు. రామచంద్రాపురం మండలంలోని అనుపల్లి పంచాయతీ నెమలిగుంటపల్లిలోని వైఎస్సార్ విగ్రహానికి రంగులు వేశారు. చిన్నగొట్టిగల్లులో వైఎస్సార్ విగ్రహానికి రంగులు వేశారు. ఎర్రావారిపాళెం మండలం కమ్మల్ల, బోడేవాండ్లపల్లి, నెరబైలు ప్రాంతాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు రంగులు వేశారు. ఇలా ప్రతి పంచాయతీలోని వైఎస్సార్ విగ్రహాలకు రంగులు పూయడంతో చూడముచ్చటగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నెల 2వ తేదీన జరిగే 16వ వర్ధంతి వేడుకలకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరవుతుండడంతో పార్టీ నేతలు, కార్యకర్తలు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.



సప్తగిరికాలనీలో వైఎస్సార్ విగ్రహం



జనార్దన కాలనీలో తళతళలాడుతున్న వైఎస్సార్ విగ్రహం

వినాయకుడి లడ్డూ రూ.3.55 లక్షలు



లడ్డూను వేలంపాటలో దక్కించుకున్న భక్తులు

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థలో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో ఏర్పాటు చేసిన లడ్డు వేలంలో రూ.3.55 లక్షలు పలికింది. ఇంజినీరింగ్ అధికారులు రూ.3.55 లక్షలకు దక్కించుకున్నారు. ఈ లడ్డూను మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య ఎస్ఈ శ్యాంసుందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, ఏసీపీ మూర్తి, మధు, తదితరులు పాల్గొన్నారు.

చిగురువాడ లడ్డు రూ.1.06 లక్షలు



వినాయకుని లడ్డూ ఊరేగింపు

తిరుపతి రూరల్: మండలంలోని చిగురువాడ పంచాయతీలో వినాయకుని లడ్డు వేలం ధర అత్యధికంగా పలికింది. 10 కేజీల బరువున్న లడ్డు ధర రూ.1.06 లక్షలు పలికింది. గ్రామంలోని వినాయకుని మండపం వద్ద ఆదివారం జరిగిన లడ్డు వేలంలో గ్రామస్తులు పాల్గొన్నారు. లడ్డు ధర రూ.10 వేల నుంచి వేలం పాటను నిర్వహించగా ఒక లక్ష ఆరు వేలకు ముచ్చేలి ధరణీకుమార్‌రెడ్డి సొంతం చేసుకున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ ఎన్ మౌర్య తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. వినాయక నిమజ్జనం కార్యక్రమంలో అధికారులు ఉండడం వలన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని రద్దు చేశామని తెలిపారు.

కోదండరామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామివారి ఆలయంలో ఈ నెల 6, 13, 20, 27వ తేదీల్లో విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. శనివారం ఉదయం 6 గంటలకు శ్రీసీతా రామ లక్ష్మణుల మూలవర్లకు అభిషేకం చేస్తారు. 7న పౌర్ణమి సందర్భంగా ఉదయం 9.30 గంటలకు అష్టోత్తర శతకలాభిషేకం చేస్తారు. అదేరోజు చంద్ర గ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు ఆలయం మూసివేస్తారు. 17న పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం జరుగనుంది. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవారిని ఊరేగింపుగా రామచంద్ర పుష్కరిణి వద్దకు తీసుకెళతారు. అక్కడ సాయంత్రం 6.30 గంటలకు ఊంజల్ సేవ చేస్తారు. 21న అమావాస్య సందర్భంగా ఉదయం 9 గంటలకు సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు హనుమంత వాహన సేవ చేపడతారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

శ్రీకాళహస్తి: ప్రజలు గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ కృష్ణమోహన్ అన్నారు. ఆయన ఆదివారం శ్రీకాళహస్తిలోని గ్రేడ్-1 గ్రంథాలయాన్ని చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌వీఆర్ఎస్ఎస్ శర్మతో కలిసి సందర్శించారు.